నమస్తే తెలంగాణ
మంచిర్యాల
కుమ్రం భీం ఆసిఫాబాద్
5 | గురువారం 20 ఫిబ్రవరి 2025 | MANCHERIAL KUMURAM BHEEM ASIFABAD

బీఆర్ఎస్ నాయకులతో కలిసి నల్లాల ఓదెలు కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న మాజీ విప్ బాల్క సుమన్

నల్లాల ఓదెలుకు బాల్క సుమన్ పరామర్శ

మందమర్రి, ఫిబ్రవరి 19 : అనారోగ్యంతో సికింద్రాబాద్ యశోద హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు ను చెన్నూర్ మాజీ ఎమ్మెల్యే, మాజీ విప్, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు బాల్క సుమన్ నాయకులతో కలసి పరామర్శించారు. ఐదు రోజులుగా దవాఖానలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న బాల్క సుమన్ బుధ వారం దవాఖానకు వెళ్లి ఓదెలుకు, ఆయన కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు. మెరు గైన వైద్యం అందించాలని ఆయన వైద్యులకు సూచించారు. బాల్క సుమన్ మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే నల్లాల ఓదెలు త్వరగా కోలు కొని ప్రజా జీవితాన్ని కొనసాగించాలని భగ వంతుడిని వేడుకుంటున్నట్లు తెలిపారు. బీఆ ర్ఎస్ నాయకులు డాక్టర్ రాజారమేశ్, రిక్కుల మధూకర్ రెడ్డి, జే.రవీందర్, కొంగల తిరుపతి రెడ్డి, బడికెల సంపత్ ఉన్నారు.

హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అధ్యక్షతన బుధవారం పార్టీ విస్తృతస్థాయి కార్యవర్గ సమావేశం జరగగా, మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు, మాజీ విప్ బాల్క సుమన్ పాల్గొన్నారు. ఈ సందర్భ ంగా కేసీఆర్ సిల్వర్ జూబ్లీ వేడుకల కార్యక్రమాల నిర్వహణ, సభ్యత్వ నమోదు, సంస్థాగత కమిటీలు, ప్లీనరీ తదితర అంశాలపై చర్చించారు.

కలెక్టర్ ఆకస్మిక తనిఖీ



విద్యార్థితో మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్

జన్నారం, ఫిబ్రవరి 19 : పొనకల్ గ్రామంలోని బాలుర హైస్కూల్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, కేజీబీవీ విద్యాలయాన్ని మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా ప్రభుత్వ బాలుర పాఠశా లను సందర్శించారు. 10, 8వ తరగతి విద్యార్థు లను ఆంగ్లము, గణితంపై విద్యార్థులకు పలు ప్రశ్నలు వేసి సమాధానాలు రాబట్టి సంతృప్తి వ్యక్తం చేశారు. అక్కడి నుంచి నేరుగా జన్నారం గ్రామంలోని పీహెచ్‌సీని సందర్శించారు. రోగు లకు అందుతున్న సేవలపై అడిగి తెలుసుకు న్నారు. అక్కడి నుంచి కిష్టాపూర్ గ్రామ సమీపం లోని కేజీబీవీ విద్యాలయానికి చేరుకుని విద్యా ర్థులు ఎలా చదువుతున్నారని, వారికి మెనూ ప్రకారం భోజనం పెడుతున్నారా అని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో పాఠ శాల ప్రధానోపాధ్యాయుడు విజయకుమార్, డాక్టర్ ఉమశ్రీ, కేజీబీవీ ప్రత్యేక అధికారి శ్రీవాణి ఉన్నారు.

చెన్నూర్‌లోని జిన్నింగ్ మిల్లు వద్ద బారులు తీరి ఉన్న పత్తి వాహనాలు

పత్తి రైతు పాట్లు

- చెన్నూర్‌లో పది రోజులకుపైగా నిలిచిన కొనుగోళ్లు
- ఆన్‌లైన్ రావడం లేదంటూ బ్రేక్ వేసిన సీసీఐ
- మిల్లుల వద్ద రోజుల తరబడి పడిగాపులు
- వాహనాల అద్దె భారం పడుతుందని కర్షకుల ఆవేదన
- ప్రైవేట్ వ్యాపారులను ఆశ్రయిస్తే నిలువుదోపిడీ
- నిత్యం రోడ్డెక్కుతున్నా పట్టించుకోని ప్రభుత్వాలు

చెన్నూర్, ఫిబ్రవరి 19 : చెన్నూర్‌లో పది రోజులకుపైగా పత్తి కొను గోళ్లు నిలిపివేయగా రైతాంగం తీవ్ర ఇబ్బందులు పడుతున్నది. నిత్యం తెల్లవారు జామున జిన్నింగ్ మిల్లుల వద్దకు చేరుకోవడం.. తీరా కొను గోలు చేయడం లేదంటూ సీసీఐ చేతులెత్తేయడం పరిపాటిగా మారింది. కేసీఆర్ సర్కారులో రంది లేకుంట పంటలు అమ్ముకున్నా మని, ప్రస్తుతం రోజుల తరబడి అవస్థలు పడుతున్నా ఇటు కేంద్రం గాని, అటు రాష్ట్ర ప్రభుత్వంగాని పట్టించుకున్న పాపానపోవడం లేదని కర్షకుల్లో ఆవేదన వ్యక్తమవుతున్నది.

ఐదు జిన్నింగ్ మిల్లుల్లో బ్రేక్

చెన్నూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ పరిధిలోని ఐదు జిన్నింగ్ మిల్లుల్లో సీసీఐ కొద్ది రోజులుగా ఆన్‌లైన్ లేదనే సాకుతో కొనుగోళ్లకు బ్రేక్ వేసింది. రైతులు రోజుల తరబడి వాహనాల్లో పత్తి పెట్టుకొని పడి గాపులు కాస్తున్నా పట్టించుకునే నాథుడు కరువయ్యాడు. ఇక సీసీఐ పత్తి కొనుగోళ్లు చేపట్టకపోవడంతో ఇదే అదనుగా భావిస్తున్న ప్రైవేట్ వ్యాపారులు రైతులను నిలువు దోపిడీ చేస్తున్నారు. సీసీఐ క్వింటాలుకు రూ 7,425 చొప్పున కొనుగోలు చేస్తుండగా, ప్రైవేట్ వ్యాపారులు మాత్రం కొర్రీలు పెడుతూ రూ.6,800లకే కొంటున్నారు. దీంతో రైతులు ప్రతీ క్వింటాలుకు రూ.700 దాకా నష్టపోవాల్సి వస్తున్నది. దీనికితోడు వారిపై వాహనాల వెయింటింగ్ చార్జీలు కూడా అదనంగా పడుతున్నాయి. ఆన్‌లైన్ రావడం లేదన్న సాకుతూ తమను ఇబ్బం దులు పెడుతున్నారంటూ రైతులు నిత్యం ఎక్కడోచోట ధర్నాలు, రాస్తారోకోలు చేపడుతున్నా స్పందించే వారే కరువయ్యారు.

గిట్లయితే బతికేదెట్లా..?

సీసీఐకి పత్తి అమ్ముకుందామని పది రోజుల కింద ఇక్కడికి వచ్చిన. పత్తి మిల్లు వద్ద వాహనాన్ని క్యూలైన్‌లో పెట్టినం. తీరా సమ యానికి ఆన్‌లైన్ పనిచేయడం లేద ని సీసీఐ అధికారులు కొనుగోళ్లు నిలిపివేశారు. ఇగ కొంటరో.. అగ కొంటరో అని ప్రతి రోజూ ఇక్కడికి వస్తున్న. రాత్రి దాకా పడిగాపులు కాసి.. ఇంటికి పోవుడైతంది. ధర్నాలు, రాస్తారోకోలు చేసినా పట్టించుకున్నోళ్లు లేరు. ఇట్లయితై రైతు బతికేదెట్లా..

- గండ్రకోట లింగయ్య, రైతు, దుగ్నెపల్లి

ఎన్‌హెచ్‌పై ఫారెస్ట్ టోల్‌గేట్లా!?

- వైల్డ్ లైఫ్ యాక్ట్‌లో నేషనల్ హైవేపై టోల్ పెట్టమని ఎక్కడా లేదు
- వసూళ్ల కోసమే ఈ వ్యవహారమంటూ స్థానికుల ఆరోపణ.. ఆగ్రహం
- ప్రతి రోజూ లక్షలాది రూపాయాలు కలెక్టయ్యే ఛాన్స్
- ఎన్‌హెచ్ఏఐ అధికారులకు ఫిర్యాదు చేసినా ఫలితం శూన్యం

నిబంధనలకు విరుద్ధంగా చెన్నూర్ నియోజకవర్గంలో జాతీయ రహదారి-63పై రెండుచోట్ల ఏర్పాటు

జాతీయ రహదారి-63పై అటవీశాఖ ఏర్పాటు చేస్తున్న టోల్‌గేట్లు

మంచిర్యాల, ఫిబ్రవరి 19 (నమస్తే తెలంగాణ ప్రతి నిధి) : చెన్నూర్‌లో నియోజకవర్గ పరిధిలో నిజా మాబాద్- జగ్దల్‌పూర్ జాతీయరహదారి-63పై రెండుచోట్ల టోల్‌గేట్లు ఏర్పాటు చేయడం వివాదా స్పదమవుతున్నది. ఫారెస్టుశాఖ తన పరిధి దాటి నిబంధనలకు విరుద్ధంగా హరిత రుసుం వసూళ్లకు సిద్ధమవుతుండగా, స్థానికంగా అగ్గి రాజుకుంటు న్నది. వైల్డ్‌లైఫ్ ప్రొటెక్షన్ యాక్ట్‌ను అతిక్రమించ డంపై విమర్శలు వెల్లువెత్తుతుండగా, ఈ వ్యవహా రంపై ఎన్‌హెచ్ఏఐ అధికారులు సైతం స్పందించ కపోవడం చర్చనీయాంశమవుతున్నది.

పారుపల్లి-కిష్టంపేటలో..

కోటపల్లి నుంచి పారుపల్లి, చెన్నూర్ మండలం కిష్టంపేటలో రెండు టోల్‌గేట్‌లను అధికారులు ఏర్పాటు చేస్తున్నారు. ఈ ప్రాంతం ప్రాణహిత (కృష్ణజింకల) అభయారణ్యం పరిధిలోకి వస్తుందని.. అందుకే హరితరుసం వసూలు చేసేందుకు ఉన్నతాధికారులు ఆదేశాలు ఇ చ్చారని చెబుతున్నారు. అటవీశాఖ వైల్డ్ లైఫ్ ప్రొటెక్షన్ యాక్ట్ -1972 సెక్షన్ 28 (1)(డీ) అండ్ (2) ప్రకారం అనుమ తులు వచ్చాయంటున్నారు. కానీ, ఈ విషయంలో అటవీ శాఖ అధి కారులు వైల్డ్‌లైఫ్ ప్రొటెక్షన్ యా క్ట్‌ను అతిక్రమిస్తూ, అటవీశాఖ తన పరిధి దాటి జాతీయ రహదారిపై రుసుం వసూ ళ్లకు తెరలేపుతున్నదని నిపుణులు ఆరోపిస్తు న్నారు. చట్టంలో ఉన్నది ఒక టైతే అధికా రులు చేసేది మరోలా ఉందంటూ మండిపడుతున్నారు. ఆ వివ రాలు ఏంటో చూద్దాం..

అభయారణ్యంలోనే వసూలు చేయాలి.. హైవేలపై ఆ అధికారం లేదు..

వైల్డ్‌లైఫ్ ప్రొటెక్షన్ యాక్ట్-1972 సెక్షన్ 28 (1) (డీ) అండ్ (2) అనుసరించి చీఫ్ వైల్డ్ లైఫ్ వార్డెన్‌కు అభయా రణ్యం ప్రాంతంలో హరిత రుసం వసూలు చేసే అధి కారం ఉందని అటవీ శాఖ అధికారులు చెబుతున్నారు. కానీ, ఒక్కసారి యాక్ట్‌లోని 28 సెక్షన్‌ను నిశితంగా పరిశీ లిస్తే.. సెక్షన్ 28(1)ను అనుసరించి చీఫ్ వైల్డ్ లైఫ్ వార్డె న్‌కు అభయారణ్యం లోపలికి ఎవరినైనా అనుమతించే అధికారం కల్పించబడింది. 28 (1) (ఏ) వన్యప్రాణుల పరిశోధన-అధ్యయనం, 28 (1) (బీ)ఫొటోగ్రఫీ, 28(1) (సీ) శాస్త్రీయ పరిశోధన, 28(1) (డీ) టూరిజం గురించి చెబుతున్నాయి. ఇందులోనే సెక్షన్ 28 (2) అభ యారణ్యంలోకి ఎవరైనా ప్రవేశించడానికి లేదా నివసిం చడానికి అనుమతించేందుకు రుసుం వసూలు చేసే అధి కారాన్ని సైతం కల్పిస్తున్నది. దీని ప్రకారమే చెన్నూర్ లోనూ హరితరుసం వసూలు చేస్తున్నామని అటవీశాఖ అధికారులు అంటున్నారు. ఇక్కడి వరకు బాగానే ఉన్నా.. యాక్ట్‌ను అనుసరించి అభయారణ్యం పరిధి లోపలి ప్రాంతాల్లోనే ఇలా రుసుం వసూలు చేసే అధికారం అటవీ శాఖ అధికారులకు ఉంది. కానీ ప్రస్తుతం పారు పల్లి, కిష్టంపేటలో ఫారెస్టు అధికారులు ఏర్పాటు చేసిన టోల్‌గేట్లు పూర్తిగా జాతీయ రహదారి-63 పరిధిలోకి వస్తాయి. ఈ నేషనల్ హైవే అనేది అభ్యయారణ్యం పరి ధిలోకి రాదు. అంటే ఇక్కడ రుసుం వసూలు చేసే అధికా రులు అటవీశాఖకు లేదని నిపుణులు అంటున్నారు.

దేశంలో ఎక్కడా లేనిది ఇక్కడే ఎందుకు..

కేంద్ర ప్రభుత్వ పరిధిలోకి వచ్చే జాతీయ రహదారులు, రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోకి వచ్చే ఆర్‌అండ్‌బీ రహదారులపై టోల్‌గేట్లు పెట్టి, పన్ను వసూలు చేసే అధికారం పూర్తిగా ఆ ప్రభుత్వాలదే. దేశంలో ఏ రాష్ట్రంలోనూ ఆ అధికా రాన్ని అటవీశాఖకు ఇవ్వలేదు. అభయారణ్యంలో ఉన్న రహదారులపై చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి కలప అక్రమ రవాణా, అటవీ జంతువుల వేటను నివారించే అధికారమే అటవీశాఖకు ఉంటుంది. కేవలం అభయారణ్యం లోపలే హరితరుసుం, డెవల ప్‌మెంట్ చార్జీలు తీసు కోవచ్చు. కానీ నేషనల్ హైవేల్లో తీసుకోవాలని వైల్డ్‌లైఫ్ చట్టంలో ఎక్కడా పేర్కొనలేదు. ఇక్కడ విచిత్రం ఏమి టంటే ఆర్టీసీ బస్సులు, గవర్నమెంట్ వెహికిల్స్, చెన్నూర్, కిష్టంపేట, కోటపల్లిలో నివసించే వారి స్థానిక వాహనా లకు ఎన్‌హెచ్ఏఐ(నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా) నిబంధనల ప్రకారం మినహాయింపు ఇస్తు న్నట్లు అటవీశాఖ అధికారులు చెబుతున్నారు. మరి అదే ఎన్‌హెచ్ఏఐ నిబంధనల ప్రకారం ఏ జాతీయ రహదారి పైనా త్రీవీలర్ వాహనాలకు టోల్ వసూలు చేయరు. మరి చెన్నూర్‌లోనే ఎందుకు చేస్తున్నట్లు.. అసలు త్రీవీలర్‌కు రూ.30, లైట్ మోటర్ వెహికిల్స్ (కార్లు, జీప్‌లు)లకు రూ.50, లారీలు, ట్రక్కులకు రూ.200 చొప్పున రుసుం ఎలా నిర్ణయించారు... ఏ చట్టంలో ఈ రుసుములను పేర్కొన్నారు. అసలు నేషనల్ హైవే మీద ఇలా రుసుం వసూలు చేసే అధికారం అటవీశాఖకు ఉందా.. అనే ప్రశ్న లకు అటు అటవీశాఖ నుంచి ఇటు ఎన్‌హెచ్ఏఐ నుంచి స్పష్టమైన సమాధానం రావడం లేదు. ఈ వ్యవహారశైలే చట్టవిరుద్ధంగా నిబంధనలు అతిక్రమించి ఎన్‌హెచ్-63పై హరితరుసుం వసూలుకు అధికారులు తెరలేపారనే వాద నలకు బలం చేకూరుస్తున్నది.

ఎవరికి వారు తప్పించుకునే యత్నం..

అటు ఎన్‌హెచ్ఏఐ, ఇటు అటవీశాఖ అధికారులు ఎవరికి వారు ఈ వ్యవహారం నుంచి తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఇలా జాతీయ రహదారులపై టోల్ వసూలు చేసే అధికారం అటవీశాఖకుగానీ, రాష్ట్రంలో ఇతర ప్రభు త్వ శాఖలకు ఉందా.. అని అటవీశాఖ ఉన్నతాధికారులకు హైదరాబాద్‌కు చెందిన ఓ ఆర్టీఐ ఆక్టివిస్ట్ సమాచార హక్కు చట్టం ద్వారా సమాచారం కోరారు. దీనికి అటవీ శాఖ ఉన్నతాధికారులు ఈ సమాచారం మా పరిధిలోకి రాదంటూ సమాధానం ఇచ్చారు. మీకే స్పష్టత లేకుండా టోల్ గేట్ ఎలా ఏర్పాటు చేశారు. టోల్ ఎందుకు వసూలు చేస్తున్నారంటే వారి నుంచి సమాధానం లేదు. ఇక ఇదే విషయంపై ఎన్‌హెచ్ఏఐ అధికారులను వివరణ కోరితే.. సింపుల్ ఆ ఆర్టీఐ దరఖాస్తును అటవీశాఖకు ఫార్వర్డ్ చేసి చేతులు దులుపుకున్నారు.రెండు శాఖలు మ్యూచువల్ అండర్‌స్టాండింగ్‌లో భాగంగానే అక్రమంగా టోల్ వసూళ్లకు తెరలేపారనే విమర్శలు వస్తున్నాయి. మరి ఇప్పటికైనా ఈ వ్యవహారాన్ని ఎన్‌హెచ్ఏఐ అధికారులు సీరియస్‌గా తీసుకుంటారా లేదా అన్నది తేలాల్సి ఉంది.

చట్టవిరుద్ధమనే ఫాస్ట్‌ట్యాగ్ పర్మిషన్ నిరాకరణ..?

ఎన్‌హెచ్-63 మీదుగా మహారాష్ట్ర, కాళేశ్వరం, మంచి ర్యాల, గోదావరిఖని, కరీంనగర్, హైదరాబాద్, మంథని ప్రాంతాల నుంచి రోజూ వేల సంఖ్యలో వాహనాలు వస్తుంటాయి. దాదాపు రెండు వేల నుంచి మూడు వేల వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. తక్కువలో తక్కువ రెండు వేల వాహనాలు ప్రతిరోజూ వస్తాయను కుంటే, అందులో వెయ్యి వాహనాలు హెవీ వెహికిల్స్ అ నుకున్నా వాహనానికి రూ.200 చొప్పున రూ.రెండు ల క్షలు అవుతుంది. ఇక కార్లు, ఆటోలు లెక్కలోకి తీసుకుం టే ఎంత కాదన్నా మరో లక్ష అవుతుంది. ఈ లెక్కన ఒక్క రోజు రూ.మూడు లక్షల వరకు వసూలు అవుతాయి. ఇక్కడ కొసమెరుపు ఏమిటంటే ఈ డబ్బులన్నీ నేరుగా వసూలు చేస్తారు. అంటే సంబంధిత టోల్‌గేట్‌లో ఉండే అధికారులు డబ్బులు తీసుకొని రిసీప్ట్ ఇస్తారు. అలా తీసు కున్న డబ్బుల్లో అధికారిక లెక్కల్లో చేరిది ఎంత.. అక్రమా ర్కుల చేబుల్లోకి పోయేది ఎంత అన్నది ఎవరూ తేల్చ లేరు. అంటే తీసుకునే డబ్బులకు లెక్కా పత్రం ఉండదు. దీన్ని అరికట్టాలంటే ఫాస్ట్‌ట్యాగ్ పెట్టాలి. అప్పుడు వసూలు చేసే డబ్బులు నేరుగా బ్యాంక్ ఖాతాలో జమ అవుతాయి. చెన్నూర్‌లో ఫాస్ట్‌ట్యాగ్ పెట్టేందుకు సన్నా హాలు చేస్తున్నామని అటవీశాఖ అధికారులు చెబుతున్నా.. గవర్నమెంట్ ఆర్డర్ లేదా జీవో ఉంటేనే బ్యాంక్‌లు ఫాస్ట్ ట్యాగ్ ఇస్తాయని తెలుస్తున్నది. ఈ లెక్కన ఇక్కడ ఫాస్ట్ ట్యాగ్ పెట్టే అవకాశం లేదని నిపుణులు అంటున్నారు. ఈ విషయమై అటవీశాఖ అధికారులు ఓ బ్యాంక్‌ను సంప్ర దించగా... గవర్నమెంట్ ఆర్డర్ ఉంటేనే ఇస్తామని, సున్ని తంగా నిరాకరించినట్లు అటవీశాఖలో పనిచేసే ఓ ఉద్యోగి తెలిపారు. దీంతో ఏం చేయాలో తెలియక అధికారులు తలలు పట్టుకుంటున్నట్లు తెలిసింది.

టోల్‌గేట్ వద్ద ఏర్పాటు చేసిన రుసుం ధరల బోర్డు

రూపాయి కూడా మిగిలేటట్లు లేదు

మాది హాజీపూర్ మండలం గుడిపేట గ్రామం. లక్షెట్టిపేటలో పత్తి కొంటలేరని చెన్నూర్‌కు వచ్చిన. పది రోజుల సంది ఇక్కడే ఇరుక్క పోయిన. ప్రతిరోజూ అక్కడి నుంచి ఇక్కడికి చార్జీలు పెట్టుకొని వచ్చి పోతున్న. వాహనంలోని పత్తి అన్‌లోడ్ చేయకపోవడం వల్ల కిరాయి చార్జీలు చెల్లించాల్సి వస్తుంది. పత్తి అమ్మితే వచ్చే సొమ్ముంతా కిరాయిలకే సరిపోతుంది. ఏడాది పాటు కష్టపడితే రూపాయి కూడా మిగిలేటట్లు లేదు.

- సింగతి సత్తన్న, రైతు, గుడిపేట

రైతుల గోస పట్టదా

పత్తి అమ్ముకోవడా నికి అష్టకష్టాలు పడాల్సి వస్తున్నది. ప్రైవేట్ వ్యాపారు లకు అమ్ముదా మంటే క్వింటాలుకు రూ. 6,800 ఇస్తున్నరు. రూ. లక్షకు రూ వెయ్యి చొప్పున క్యాష్ కటింగ్ చేస్తున్నరు. ప్రతి రైతు క్వింటాలుకు రూ.700 దాకా నష్టపోవాల్సి వస్తుంది. అంతేగాకుంగా ఈ పది రోజులకు వాహనాల వెయిటింగ్ చార్జీలు చెల్లించాల్సి వస్తుంది. ఇగ రైతుకు ఏం మిగిలినట్లు. రైతుల గోస ఎవ్వరికీ పట్టడం లేదు.

- ఆకుల రాజయ్య, చింతలపల్లి

శ్రీరాంపూర్ జీఎంగా శ్రీనివాస్ బాధ్యతలు

జీఎంను సన్మానిస్తున్న అధికారులు

జీఎంను సన్మానించిన టీబీజీకేఎస్ నాయకులు

శ్రీరాంపూర్, ఫిబ్రవరి 19 : శ్రీరాంపూర్ జీఎం కార్యాలయంలో ఏరియా జీఎంగా శ్రీని వాస్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. జీఎం శ్రీనివాస్‌కు ఇన్‌చార్జి జీఎం శ్రీనివాస్, ఎస్‌వోటూ జీఎం సత్యనారాయణ, డీఐవై జీఎం అరవిందరావు స్వాగతం పలికారు. శాలువాలతో సన్మానించారు. జీఎం శ్రీనివాస్ బెల్లంపల్లి ఏరియా నుంచి బదిలీపై శ్రీరాంపూ ర్‌కు వచ్చారు. పీవో ఏవీ రెడ్డి, ఫైనాన్స్ ఏజీఎం మురళీధర్, అధికారుల సంఘం అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి, డీవైజీఎం చిరంజీ వులు, ఆనంద్‌కుమార్, చంద్రలింగం, డీవైసీ ఎంవో డాక్టర్ రమేశ్‌బాబు, సెక్యూరిటీ ఆఫీ సర్ జక్కారెడ్డి, ఎస్ఈ కిరణ్‌కుమార్, ఏజెంట్లు శ్రీధర్, రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

శ్రీరాంపూర్ ఏరియా జీఎంగా బాధ్యతలు చేప ట్టిన శ్రీనివాస్‌ను బుధవారం టీబీజీకేఎస్ నా యకులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువా లతో సన్మానించారు. టీబీజీకేఎస్ రాష్ట్ర ప్రధా న కార్యదర్శి సురేందరెడ్డి, ఏరియా ఉపాధ్య క్షుడు పెట్టం లక్ష్మణ్, డిప్యూటీ ప్రధాన కార్య దర్శి బండి రమేశ్, కేంద్ర చీఫ్ ఆర్గనైజింగ్ కార్యదర్శి పొగాకు రమేశ్, ఆర్గనైజర్ అన్వేష్ రెడ్డి జీఎం శ్రీనివాస్‌ను కలిసి సత్కరించారు. అనంతరం శ్రీరాంపూర్ ఏరియా సమస్యలను జీఎం దృష్టికి తీసుకెళ్లారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎండీ లాలా, సుధాకర్, సాధుల భాస్కర్, ఉత్తేజ్‌రెడ్డి, జగదీష్, వెంకట్‌రెడ్డి, రాజునాయక్, గోపాల్, జైపాల్‌రెడ్డి, సతీశ్ యాదవ్, బుద్ధి ప్రసాద్ పాల్గొన్నారు.

అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు

ఎస్పీ డీవీ శ్రీనివాస రావు

ఆసిఫాబాద్ అంబేద్కర్ చౌక్, ఫిబ్రవరి 19 : జిల్లాలో అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకొని పీడీ యాక్ట్ నమోదు చేస్తా మని ఎస్పీ డీవీ శ్రీనివాస రావు బుధవారం ఓ ప్రకటనలో హెచ్చరించారు. జిల్లాలో మత్తుప దార్థాలు, పీడీఎస్ బియ్యం, అక్రమ పశువుల రవాణా చేయడంలాంటివి చేపడితే కఠినంగా వ్యవహరించాలని పోలీస్ అధికారులకు ఆదే శాలు జారీ చేశారు. ఇటీవల సిర్పూర్ టీ మండలం హుడ్కిలి గ్రామ చెక్ పోస్ట్ వద్ద 208 క్వింటాళ్ల బియ్యం తరలిస్తున్న కేసులో 12 మంది నిందితులను కోర్టులో హాజరుప రిచి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. జిల్లాలో 2024 నుంచి ఇప్పటి వరకు పీడీఎస్ బియ్యం తరలింపులో 124 కేసుల్లో 1594 క్వింటాళ్ల బియ్యం స్వాధీనం చేసుకుని 214 మందిపై కేసులు నమోదు చేశామని, అక్రమ పశువుల తరలింపులో 63 కేసుల్లో 208 మందికి రిమాండ్ విధించారని, 917 పశువు లను రక్షించామని తెలిపారు.